క్లుప్తంగా

అభాగ్యురాలికి ఆసరా



మహిళను కేజీహెచ్‌కు తరలిస్తున్న మమత, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్

అల్లిపురం: అపస్మారక స్థితిలో పడి ఉన్న మహిళకు మమత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మమత అండగా నిలిచింది. కంచరపాలెం మెట్టుపై గుర్తు తెలియని మహిళ దెబ్బలతో అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మమతకు సమాచారం అందజేశారు. దీంతో ఆమె అక్కడికి చేరుకుని ఆ అభాగ్యురాలిని స్థానికుల సహకారంతో కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు.

కుట్టు మిషన్ల పంపిణీ



జ్యూట్ సంచుల తయారీ, కుట్టు మిషన్‌లు అందజేసిన యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ఫిషింగ్ హార్బర్ రోడ్డులోని బాల వికాస్ ఫౌండేషన్ సంస్థ నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి జూట్ సంచుల తయారీ మెషిన్, 3 సాధారణ కుట్టుమిషన్లను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ కేఎస్‌డీ శివప్రసాద్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పథకాల్లో భాగస్వాములై ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, బ్యాంకు డిప్యూటీ మేనేజర్ ప్రసాద్, సుధ, తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు



వీధిలైట్లు వేయిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు చొరవతో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. బుధవారం వార్డులో రామకృష్ణ జంక్షన్ మసీద్ వద్ద ముస్లింల సౌకర్యార్థం లైట్లు ఏర్పాటు చేశామని విల్లూరి తెలిపారు. అదే విధంగా వార్డులో అన్ని ప్రధాన కూడళ్లలో కూడా లైట్లు ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

మర్యాద పూర్వక కలయిక



ఎమ్మెల్యేను కలిసిన ఈవో రమేష్‌నాయుడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్‌నాయుడు బుధవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ రామాలయంలో గురువారం నిర్వహించనున్న సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీరు సీహెచ్‌వీ రమణ పాల్గొన్నారు.

మూడో రోజు వేలం పాట వాయిదా

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో నిర్వహించిన పూర్ణామార్కెట్ ఆశీలు వేలం పాట మూడో రోజు బుధవారం కూడా వాయిదా పడింది. ఈ ఏడాది పూర్ణామార్కెట్, రామకృష్ణ రైతుబజార్, రెల్లివీధి మార్కెట్‌కు సంబంధించి జీవీఎంసీ అధికారులు ఆశీలపాట వేలం నిర్వహించగా.. వరుసగా మూడు రోజుల పాటు కాంట్రాక్టర్లు వేలం పాటకు హాజరవ్వలేదు. గజిట్ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లతామని జెడ్సీ కె.శివప్రసాద్ తెలిపారు.

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం

- ముస్తాబైన రామాలయాలు
- సందడిగా వీధులు

అల్లిపురం: శ్రీరామ నవమికి రామాలయాలు ముస్తాబయ్యాయి. వాడవాడలా సీతారాముల కల్యాణోత్స వం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సంద ర్భంగా వీధులన్నీ విద్యుత్ దీపాలు, చలువ పందిళ్ల తో, పెండాల్స్‌తోను, అరటిచెట్లు స్వాగత ద్వారాలు, మామిడాకులు, పూలతో తోరణాలతో కళకళలాడు తున్నాయి. గురువారం ఉదయం సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టేందుకు అల్లిపురం మెయిన్‌రోడ్డులోని శ్రీరామాలయం, బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం దత్తత దేవాలయం కోదండ రామాలయం, బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, గోవింద్ రోడ్డులోని రాంరాం మందిరం తదితర ప్రాంతాలలో ఏర్పాట్లు చేశారు. రాములోరి పెళ్లికి ఊరంతా పెద్దలే అన్నట్లు తలో పని చేపడుతున్నారు. మహిళలు సీతారాముల కల్యాణ విందుకు అవసరమైన పూర్ణం బూర్లు తయారీతో బంగారుమెట్టలో సందడి నెలకొంది. మరి ఇంకెందుకు ఆలస్యం గురువారం ఉదయాన్నే పెళ్లికి రడీ అయిపోదాం..రారండోయ్..



సీతారాముల కల్యాణానికి సిద్ధమవుతున్న వేదిక



విందుకు పూర్ణాలు తయారు చేస్తున్న బంగారుమెట్ట మహిళలు

ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ఆదుకోవాలి

డాబాగార్డెన్స్: ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెర్రో అల్లాయిస్ ఉత్పత్తిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే షరఫ్ కోరారు. నగరంలోని ఓ హోటల్లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాల్లోని ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్ యూనిట్ రూ.3 కంటే తక్కువకే లభిస్తుందన్నారు. మన దేశంలో కూడా పలు రాష్ట్రాల్లో విద్యుత్ చౌక ధరకే లభిస్తున్నందున అక్కడి ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలు వాటి మనుగడను నిలబెట్టుకుంటున్నాయని చెప్పారు. ఫెర్రో ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు అత్యంత అవసరమైన ముడి పదార్థం విద్యుత్ సరఫరా అని, ఉత్పత్తి ఖర్చులో ఆయా ఫెర్రో అల్లాయిస్ స్వభావాన్ని బట్టి 35 నుంచి 70 శాతం ఖర్చు విద్యుత్ కొనుగోలుకు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ప్రత్యేక తరగతికి చెందిన పరిశ్రమగా గుర్తించి ఎన్‌టీపీసీ నుంచి విద్యుత్ సరఫరా కేటాయింపులు చేయాలన్నారు. రాష్ట్రంలో 39 ఫెర్రో పరిశ్రమలుండగా.. 33 యూనిట్లు 700 ఎంవీఏ పైగానే కాంట్రాక్టెడ్ ఎండీతో నడుస్తూ 40 వేల మంది కార్మిక కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధి శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఫెర్రో అల్లాయిస్ ఉత్పత్తిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు షరఫ్

ఎరుకుమాంబకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 27 వార్డు దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్ భక్తుల నామాగోత్రాలతో అర్చనలు చేశారు. సాయంత్రం భక్తులు అమ్మవారికి జలాభిషేకం అనంతరం అమ్మవారికి పసుపు, కుంకుమలతో అర్చనలు జరిపారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

డాబాగార్డెన్స్: ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా చదవాలని సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ బి.సూర్యారావు సూచించారు. ఆ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు మాట్లాడుతూ మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఇటు పాఠశాల, అటు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అభిలషించారు. ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలన్నారు. ఉపాధ్యాయుడు సంజీవ్ కుమార్ 24 పేజీల బుక్‌లెట్, ఓఎంఆర్, పరీక్ష కేంద్రంలో విద్యార్థులు పాటించాల్సిన నియమాలు వివరించారు. విద్యార్థులకు పరీక్షా సామగ్రి, హాల్‌టికెట్లను సూర్యారావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జూలియన్, శాంతకుమారి, మధుబాబు, పీటర్, రోహిణి, విజయ్‌కుమార్, కిషోర్, రాయప్పరెడ్డి, అంథోనీపాల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రి, హాల్‌టికెట్స్ అందజేస్తున్న సూర్యారావు, ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు

కనకమహాలక్ష్మి సన్నిధిలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి



అమ్మవారి సన్నిధిలో ప్రవీణ్‌ప్రకాష్

డాబాగార్డెన్స్: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ బుధవారం కనకమహాలక్ష్మిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి, ఆయనతో అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌నాయుడు, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, కార్యనిర్వాహక ఇంజినీరు సీహెచ్‌వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలు

తాటిచెట్లపాలెం: రైల్వే బోర్డుకు చెందిన ప్రయాణికుల సదుపాయాల కమిటీ(పాసింజర్ ఎమినిటీస్ కమిటీ) సభ్యులు బుధవారం కూడా వాల్తేర్ డివిజన్‌లో పర్యటించారు. కొత్తవలస–కోరాపుట్ లైన్‌లోని దమన్‌జోడి, కోరాపుట్ రైల్వే స్టేషన్లలో సభ్యులు దిలీప్‌కుమార్ మల్లిక్, అభిజిత్‌దాస్, నిర్మలకిషోర్ బొల్లిన, గొట్టాల ఉమారాణి, డాక్టర్ జి.వి.మంజుల, పరశురాం మహతో తనిఖీలు చేపట్టారు. ఆయా స్టేషన్లలో ప్రయాణికుల కనీస సదుపాయాలైన తాగునీరు, వెయిటింగ్ హాల్స్, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫాం పైకప్పులు, పాదచారుల వంతెనలు, కూర్చునే సదుపాయాలు, కేటరింగ్ స్టాల్స్ వంటి వాటితోపాటు పరిశుభ్రత, కేటరింగ్ స్టాల్స్ వద్ద ఆహార నాణ్యతలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా వెయిటింగ్ హాల్స్, ప్లాట్‌ఫారాలపై గల ప్రయాణికులతో కమిటీ సభ్యులు మాట్లాడి, వారి సూచనలు తీసుకున్నారు. ఈ స్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద మరిన్ని సదుపాయాలను సమకూర్చనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పర్యటనలో డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవినాష్ శర్మ, ఎలక్ట్రికల్, సిగ్నల్, టెలికం, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.



కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న పాసింజర్ ఎమినిటీస్ కమిటీ సభ్యులు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఒడ్డుకు కొట్టుకొచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డాబాగార్డెన్స్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం సాయంత్రం నేవల్ కోస్టల్ బ్యాటరీ సమీపాన ఫిషింగ్ హార్బర్ ఒడ్డుకు కొట్టుకొచ్చింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 45 నుంచి 50 ఏళ్ల వయస్సు ఉంటుందని, నల్లరంగు కాటన్ ప్యాంట్, డార్క్ బ్లూ, వైట్ అండ్ రెడ్ చెక్స్ షర్ట్ ధరించి ఉన్నాడని, 5.8 అడుగుల ఎత్తు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఫిషింగ్ హార్బర్ ఒడ్డుకు కొట్టుకొచ్చిందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రేవతమ్మ తెలిపారు. మృతదేహాన్ని గుర్తు పట్టేవారు 0891–2563632, 9440706019, 9440796028 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించండి

మహారాణిపేట: సాధారణ ప్రసవాలపై మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. కంచరపాలెం ఆర్పీ పేట డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బందితో మాట్లాడారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, శస్త్ర చికిత్సలు చేసే ప్రసవాలను తగ్గించాలని చెప్పారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యుల సలహా మేరకు వారికి ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. బయోమెట్రిక్ హాజరుతోపాటు ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్(ఎఫ్‌ఆర్‌ఎస్) హాజరు వేయాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది అంతా డ్రెస్ కోడ్ పాటించాలని పేర్కొన్నారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

కనకమహాలక్ష్మి అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఆలయ ఈవో శిరీషకు విరాళం అందిస్తున్న కంకటాల సౌమ్య

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన కంకటాల సౌమ్య రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీషకు అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం దాతకు ప్రసాదం అందజేశారు.

శ్రీరామనవమికి ముత్యాలు బహూకరణ

శ్రీరామనవమి సందర్భంగా కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గురువారం నిర్వహించనున్న స్వామి కల్యాణానికి ఉపయోగించే ముత్యాల తలంబ్రాలను ఆంధ్రప్రదేశ్ ప్రాదేశిక్ మార్వారి సమ్మేళన్ రాష్ట్ర కార్యదర్శి పోడేశ్వర్ పురోహిత్ దంపతులు ఆలయ ఈవో శిరీషకు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ధనలత, వెంకటరత్నం, అనురాధ, సతీష్, మారుతీప్రసాద్, సుబ్రహ్మణ్యం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

ఎల్ఐసీ పెన్షనర్లు, ఉద్యోగుల ధర్నా



ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు, ఉద్యోగులు

అల్లిపురం: అఖిల భారత ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద పెన్షనర్లు, ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డిమాండ్ల సాధన కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బుధవారం నిర్వహించిన ధర్నాకు మద్దతుగా ఇక్కడ నిరసన తెలిపినట్టు పెన్షనర్స్ సంఘం నాయకులు కె.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ పింఛన్ 15 శాతంగా నిర్ణయించడంతో అది ఒక వ్యక్తి జీవించడానికి కూడా చాలదన్నారు. పెన్షనర్ల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వారు ఖండించారు. ఈ కార్యక్రమంలో మీడియా కో ఆర్డినేటర్ రామకృష్ణ, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వార్షిక కల్యాణోత్సవానికి అశోక్‌కు ఆహ్వానం

సింహాచలం: వచ్చేనెల 2వ తేదీన జరగనున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవానికి సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజుకు బుధవారం దేవస్థానం అధికార, వైదికులు ఆహ్వానం పలికారు. విజయనగరంలోని ఆయన స్వగృహానికి వెళ్లిన దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు అశోక్‌గజపతికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

మహిళాభ్యున్నతే జగనన్న లక్ష్యం



ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపి, బొడ్డేటి ప్రసాద్, లబ్ధిదారులు

అల్లిపురం: మహిళల అభ్యున్నతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంథి గోపికృష్ణ అన్నారు. పొదుపు సంఘాల అక్క, చెల్లెమ్మలకు బాసటగా వరుసగా మూడో ఏడాది వైఎస్ఆర్ ఆసరా నిధులు విడుదల చేసిన సందర్భంగా బుధవారం 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట సచివాలయం వద్ద ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా పథకంతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, సచివాలయం కన్వీనర్స్ ఆడారి మహేష్, లక్ష్మీకాంతం, కొల్లు సత్యవతి, గంగా, కళ, సచివాలయ అడ్మిన్‌లు, ఆర్‌పీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సహస్ర తులసీ దళార్చన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఏయూ క్యాంపస్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి అన్నారు. బుధవారం ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతరం ఆరోగ్య జీవనం అలవరచుకోవాలని సూచించారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ 'సే నో టు డ్రగ్స్'అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. యువత పెడతోవ పట్టకుండా వారిలో మంచి ఆలోచనలు పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14500 ఏర్పాటు చేసి యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల వైద్యులు డాక్టర్ కె.ప్రభాత్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఎల్.మాధవి, ఎక్సైజ్ విభాగం ఎస్ఐ జి.రాజేశ్వరి, ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి

వృక్షశాస్త్ర విభాగం సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగంలో ఉన్న వివిధ మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వయంగా అభివృద్ధి చేస్తున్న పలు మొక్కలతో కూడిన నర్సరీని పరిశీలించారు. విద్యార్థులను అడిగి మొక్కల వివరాలు, ప్రత్యేకతలు, వాటిని పెంచే విధానం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. వర్సిటీలో నూతనంగా నిర్మించే పలు భవనాల వద్ద సుందీకరణ, మొక్కలు నాటే కార్యక్రమంలో విలువైన సూచనలు వృక్షశాస్త్ర విభాగం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.రత్నకుమార్, బ్యూటిఫికేషన్ విభాగం డీన్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

సుకన్య సమృద్ధి యోజనపై విస్తృత అవగాహన

ఎంవీపీ కాలనీ: ఆడపిల్లల భవిష్యత్ ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సుకన్య సమృద్ధి యోజన పథకంపై రీజనల్ పోస్టల్ కార్యాలయం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పించారు. బుధవారం లాసన్స్‌బే కాలనీ పోస్ట్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ విశాఖ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ డబ్ల్యూ.నాగ అదిత్యకుమార్ మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ప్రతి ఇంటి ఆడపిల్లకు మంచి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యధిక వడ్డీ రేటును అందిస్తుందన్నారు. ఆడ పిల్ల 18 ఏళ్లు నిండే వరకు డబ్బులు జమచేస్తే తనకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులకు పథకం వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషణ పక్వాడాలో పాల్గొన్న సీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ లావణ్య తదితరులు

అల్లిపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అర్బన్–2 సీడీపీవో జి.శ్రీలత అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా బుధవారం అమ్మవారివీధి, ప్రకాషరావుపేట సెక్టార్ టీచర్స్ నిర్వహించిన పౌష్టికాహారం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు వాటిపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా కౌమార దశ నుంచే కిషోర బాలికలు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్.లావణ్య, ప్రకాషరావుపేట సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.